క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



రాజేశ్‌కు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సీఎంఆర్‌ఎఫ్ ఒక వరమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన రాజేశ్‌కు రూ.2.50లక్షల ఎల్‌వో సీ మంజూరు కాగా హైదరాబాద్‌లోని తన క్వార్టర్‌లో ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు.

'సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి'



మాట్లాడుతున్న సోమన్‌పల్లి గ్రామస్తులు

చెన్నూర్: మండలంలోని సోమన్‌పల్లి గ్రామంలో 20ఏళ్ల నుంచి దళితులు సాగు చేసుకుంటున్న భూమికి అధికారులు పట్టాలిచ్చి హక్కు కల్పించాలని సోమన్‌పల్లి గ్రామానికి చెందిన దళిత కులస్తులు తోకల లక్ష్మణ్, లింగయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ మాదిగ కులానికి చెందిన సుమారు వంద కుటుంబాలు సర్వే నంబర్ 306లో 49ఎకరాలు, 1267సర్వే నంబర్‌లో 70ఎకరాల భూములలో సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. మాజీ సర్పంచ్‌తో పాటు మరికొంత మంది దళిత భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి సాగులో ఉన్న రైతులకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శేఖర్, జంపయ్య, సురేశ్, ప్రశాంత్, మల్లేశ్, బన్నీ పాల్గొన్నారు.

జాతీయ రహదారి మరమ్మతు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమారం: మండలంలోని జోడువాగుల వద్ద జరుగుతున్న రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేశ్, ఆవిడపు రవితేజ, అలకాఇటి తిరుపతి పరిశీలించారు. మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలోని జోడువాగుల వద్ద రోడ్డు ధ్వంసం కావడంతో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి నేషనల్ హైవేస్ అధికారులతో మాట్లాడి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



సభ్యులను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

పాతమంచిర్యాల: మంచిర్యాల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎస్ పంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. నూతన కార్యవర్గ సభ్యులతో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గాజుల ముఖేష్‌గౌడ్ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ సభ్యులను, ముఖ్యఅతిథులను సొసైటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు మందమర్రి, చెన్నూర్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

కారు, ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు

బెల్లంపల్లి: పాత సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం క్రాస్ రోడ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. టూటౌన్ ఏఎస్సై నర్సయ్య కథనం ప్రకారం.. బజారు ఏరియా నుంచి ఏఎంసీ వైపునకు వెళ్తున్న కారు, ఏఎంసీ వైపు నుంచి గోల్‌బంగ్లా బస్తీ వైపునకు వస్తున్న ఆటో జీఎం కార్యాలయం క్రాస్‌రోడ్ వద్ద ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు గాయపడగా, ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఏఎస్సై తెలిపారు. గాయపడిన వ్యక్తుల వివరాలు తెలియరాలేదని, క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పంపించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదాల మలుపులు..!

- కోల్‌బెల్ట్ రహదారిలో భయం భయం
- ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన
- శ్రీరాంపూర్ నుంచి మందమర్రి వరకు ఇదే వరుస..
- తాజాగా టిప్పర్ బోల్తా ఘటనే ప్రత్యక్ష నిదర్శనం
- పట్టింపులేని అధికారులు



ఆర్‌కే ఓసీ సమీపంలో ప్రమాదకరంగా మూలమలుపు

రామకృష్ణాపూర్: కోల్‌బెల్ట్ రహదారిలో వరుస ప్రమాదాల కారణంగా వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ మార్గంలో ఉన్న మూలమలుపులతో నానా హైరానా పడాల్సి వస్తోంది. కోల్‌బెల్ట్ ప్రాంతాలైన శ్రీరాంపూర్ నుంచి మొదలుకొని మందమర్రి వరకు ఇదే పరిస్థితి నెలకొని ఉంది. దీంతో సహజంగానే బొగ్గు గని కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. ఆకస్మిక మలుపులు ఉండటం ఇందుకు ప్రధాన కారణం. గతంలోనే పలు ప్రమాదాలు జరిగినప్పటికీ తాజాగా బొగ్గు టిప్పర్ బోల్తాపడటం ఆందోళన తీవ్రతను పెంచుతోంది. మలుపులకు తోడు కారుచీకట్లు అక్కడ దర్శనమిస్తుండటం కూడా ప్రమాదాలకు దారి తీస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాల్లోకి వెళ్తే..

మంచిర్యాల జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతాలు రోడ్డు ప్రమాదాలకు కారణభూతం అవుతున్నాయి. ప్రధానంగా మూలమలుపులతో ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. కొన్ని కిలోమీటర్ల వరకు సమాంతరంగా ఉన్న రోడ్డుపై ఆకస్మిక మలుపులు ఉండడమే ఇందుకు కారణం. సమీపంలోకి వస్తే తప్పా, ఎదురుగా ఏ వాహనం వస్తుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక ఆర్‌కే1ఏ గని సమీపంలోని పాలవాగు వద్ద శనివారం అర్ధరాత్రి బొగ్గు టిప్పర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ తృటిలో తప్పించుకున్నాడు. ఎడమ కాలు విరగగా స్వల్పగాయాలతో ఆయన బయటపడ్డాడు. ఎదురుగా వస్తున్న మరో టిప్పర్ వేగంగా రావటం ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

గతంలోనే ఇద్దరి మృత్యువాత..

గత శనివారం రాత్రి జరిగిన బొగ్గు టిప్పర్ బోల్తా ఘటనాస్థలి వద్దే గతంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఆరేళ్ల క్రితం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. మూల మలుపు వద్దే చిన్నలోయ ఉండటంతో 24గంటలు గడిస్తే గాని వారి జాడ తెలియలేదు. సెల్‌ఫోన్ ఆధారంగా ఘటనాస్థలిని కనుక్కున్న ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. అదే విధంగా ఆర్‌కే 4వద్ద సింగరేణి కార్మికుడు సూరయ్య సైతం రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు చొరవతీసుకొని కోల్‌బెల్ట్ రహదారి విషయంలో స్పందించాలని కార్మికులు కోరుతున్నారు. ప్రమాదకరంగా మారిన మూలమలుపుల వద్ద ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కూడా సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు లైట్లు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.



మూలమలుపు వద్ద ఇటీవల బోల్తాపడ్డ టిప్పర్(ఫైల్)

మందమర్రి వరకు ఇదే వరుస...

కోల్‌బెల్ట్ రహదారిలో మూలమలుపులతో బెంబేలెత్తిపోతున్నారు. శ్రీరాంపూర్, కృష్ణకాలనీ, రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ వద్ద గల మలుపులు డేంజర్‌గా మారాయి. బీజోన్ సెంటర్, ఆర్‌కే1ఏ పాలవాగు, మూడో జోన్ తదితర ఏరియాల్లో గల మూలమలుపులు సైతం ప్రమాదకరంగా మారాయి. రాత్రిపూట విధులు నిర్వర్తించే సింగరేణి బొగ్గు గని కార్మికులకు మలుపులు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ఎవరికి చెప్పినా పట్టించుకునే నాథుడే లేరని కార్మికులు వాపోతున్నారు. దీనికి తోడు గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారి అయినప్పటికీ లైట్లు లేక ఇక్కట్ల పాలవుతున్నామని చెబుతున్నారు.

లంబాడీతండాలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం లంబాడి తండాలో ఆదివారం మేము సైతం ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో కంటి వైద్య, గైనకాలజీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్యుడు అంజయ్య.. గ్రామంలోని దాదాపు 100మందికి పైగా కంటి వైద్య పరీక్షలు చేయగా 22మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించారు. వీరికి లయన్ కంటి ఆసుపత్రి బెల్లంపల్లిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రశాంత్, అధ్యక్షుడు సత్యం, వైద్యురాలు పూజిత, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి రాజన్న, కోశాధికారి ఆదర్శ్ వర్ధన్‌రాజు, జోన్ చైర్మన్ పాపయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

జైపూర్: మండలంలోని వేలాల గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 100మందికి బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 50మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 20మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉండగా 20మందికి ఆపరేషన్లు చేయడానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్, వైద్యులు సుగుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



చెన్నూర్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



మందమర్రిరూరల్: జెండా ఆవిష్కరిస్తున్న సారంగం



జైపూర్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చెన్నూర్: పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చకినారపు మల్లేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాసపాక మల్లేశ్, వేముల రమేశ్, తగరం శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ సమీపంలోని సాయిబాబ గుడి వద్ద నాయకులు జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి జీడి సారంగం, నాయకులు శివకుమార్, రాం శ్రీనివాస్, రాజ్‌కుమార్, సంగి రవి, సదయ్య, రమేష్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సభకు తరలిన నాయకులు

భీమారం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో ఆదివారం జరిగిన ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవ సభకి మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్ అసంపల్లి శ్రీనివాస్‌తో పాటు మాదిగలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నాయకులు ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆత్కూరి రాజబాపు, నాయకులు కలగూర తిరుపతి, ధర్మేందర్ పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ జానపాటి శరత్‌బాబు, సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రేంగు చంద్రశేఖర్, జిల్లా జనరల్ సెక్రెటరీ సుందిళ్ల మల్లేశ్, ఉపాధ్యక్షుడు జలంపల్లి శ్రీనివాస్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. పెగడపల్లిలో గల డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

ఘనంగా బోనాల పండుగ



నస్పూర్: జాతరలో పాల్గొన్న జీఎం దంపతులు, చైర్మన్



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



బోనాలతో వెళ్తున్న మహిళలు, నాయకులు

జన్నారం: మండలంలోని పొనకల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆషాడ మాసం పురస్కరించుకొని బోనాల పండుగా చేశారు. గౌడ సంఘం మహిళలు బోనాలతో వెళ్లి పోచమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి దేవతలకు బోనాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పొనకల్ గౌడ సంఘం అధ్యక్షుడు పాడేటి సతీశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాసగౌడ్, రమేశ్‌గౌడ్, లింగన్నగౌడ్, రవిగౌడ్, శంకర్‌గౌడ్, సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాలు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీలో ఆదివారం ముక్కిడి పోచమ్మ బోనాల జాతరను భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, రాధాకుమారి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారం పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

మత్తుపదార్థాల నిర్మూలనకు సహకరించాలి



నాయకులతో మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

తాండూర్: మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. పోలీసు సర్కిల్ కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర రకాల మత్తు పదార్థాలకు అలవాటు పడి అనేకమంది జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. మత్తు బారి నుంచి సమాజాన్ని కాపాడుకోవడానికి పోలీసులు చేస్తున్న కృషికి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థ శ్రేణులు, బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ.ఈసా, నాయకులు పుట్ట శ్రీనివాస్, జుబేర్, మోమిన్ అలీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా శ్మశానవాటిక స్థలం



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: పట్టణంలోని యాపల్ సమీపంలోని శ్మశాన వాటిక స్థలం వివాదాస్పదంగా మారింది. ఊరు మందమర్రికి చెందిన కొందరు శ్మశాన వాటిక స్థలంలో జేసీబీతో గోరీలు, పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ విషయం తెలిసిన వెంటనే యాపల్ ప్రాంత ప్రజలు ఆదివారం అక్కడికి చేరుకుని చదును చేసే పనులను అడ్డుకున్నారు. ఈ విషయంలో స్థానిక ప్రజలకు, చదునుచేయించే వారికి వాగ్వాదం జరిగింది. యాభై, అరవై ఏళ్లుగా తమ కుటుంబీకులు చనిపోతే అక్కడే దహన కార్యక్రమాలు నిర్వహించి గోరీలు కూడా నిర్మించామని, ఇప్పుడు ఆ స్థలం మాదేనని గోరీలు తొలగిస్తే ఊరుకునేది లేదని ప్రజలు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆ స్థలం విషయంపై రికార్డులు పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

పిన్నారంలో 'పల్లెనిద్ర'



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

కోటపల్లి: గ్రామ ప్రజలతో మమేకమై సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్లు కోటపల్లి ఎస్సై రాజేందర్ అన్నారు. రామగుండం కమిషనర్ ఆదేశాల మేరకు పిన్నారంలో ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, శాంతి భద్రతలకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంతాప సభ



రాథోడ్ రమేశ్‌కు నివాళులు

శ్రీరాంపూర్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సేవలు మరువలేనివని ఆయన అభిమానులు కొనియాడారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల రాజేశం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు రాథోడ్ రమేశ్‌తో నాడు టీడీపీలో పని చేసిన ఆయన అభిమానులు హాజరయ్యారు. మాజీ మంత్రి బోడ జనార్థన్, మంచిర్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయన అభిమానులు బెల్లంకొండ మురళీ, ఎం.గురవయ్య, బండారి మల్లేశ్, తిప్పని రామయ్య, కాశెట్టి నాగేశ్వర్‌రావు, కొప్పర్తి రాజం, బొడ్డు చిన్నయ్య, రాజారావు, బేర పోశం, జక్కుల కుమార్, చిలుముల నాగరాజు, సత్రం రమేశ్, రాంబాబు, సదానందం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన కొట్నాక మాన్కు ఇటీవల మరణించాడు. దీంతో ఆయన కుటుంబానికి, గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు రూ.5వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. కన్వీనర్ రాజన్న, సభ్యులు సునీల్, వెంకటేష్, గంగారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణ పనులు..!



లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల నూతన పక్కా భవన నిర్మాణ పనులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. విద్యార్థులు తిరిగే ప్రదేశాన్ని నిర్మాణ పనులకు వినియోగించుకోవడంతో నిత్యం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తరగతి గదులు నిర్వహించే ప్రదేశంలో మధ్యాహ్న భోజనం వండుతుండడంతో కట్టెల పొయ్యి నుంచి వచ్చే పొగతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పాఠశాల ఎదుట ఇనుప రాడ్లు, ఇతర సామగ్రి, మట్టి, ఇసుక, కంకర కుప్పలు పోయడంతో మైదానానికి వెళ్లలేకపోతున్నారు. పిల్లల ప్రదేశంలో పెద్ద గొయ్యిలు ఉండడంతో ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొంది. ముందస్తు జాగ్రత్తగా కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని పనులు వేరే ప్రదేశంలో ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

– లక్సెట్టిపేట





9న వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

చెన్నూర్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఈ నెల 9న ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల స్థాయి వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కళామంచ్ కన్వీనర్ మామిడి అక్షిత తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

సీసీ కెమెరాల ప్రాధాన్యత గుర్తించాలి

బెల్లంపల్లి: నేరాల అదుపు, నిందితుల గుర్తింపు కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని షాపుల యాజమానులకు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య సూచించారు. పట్టణంలోని కాంటా చౌరస్తాలో ఆదివారం షాపుల యాజమానులకు అవగాహన కల్పించారు. ఇళ్ల ప్రాంతాల్లో, షాపుల వద్ద, కూడళ్ల ఇతర ముఖ్యమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899